సాక్షి
నిజామాబాద్

శనివారం : 20 : సెప్టెంబర్ : 2025



500 టీఎంసీల వరద

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 500 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

- IIలో ▸



భారత న్యాయ విద్యకు..

భారతీయ న్యాయవాదులు, న్యాయ విద్యకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని అంతర్జాతీయ న్యాయవాది శ్రీనివాసరావు అన్నారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం

30.3 /22.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

యాక్షన్ షురూ

బల్దియా రెవెన్యూలో ప్రక్షాళన

- ఫైస్థాయి నుంచి ప్రారంభించిన కమిషనర్
- డీసీ రవిబాబుకు రెవెన్యూ విభాగం కట్
- అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు కేటాయింపు
- ఇక పాత ఫైళ్లకు మోక్షం





సాక్షి ఎఫెక్ట్..

రెవెన్యూ విభాగంలో అంతర్గత బదిలీలు

బల్దియాలో ఏసీబీ దాడులతో కమిషనర్ దిలీప్‌కుమార్ దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు. రెవెన్యూ ఆఫీసర్ ఖయ్యూమ్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో సీనియర్ అసిస్టెంట్ స్వప్నను నియమించారు. ఆర్ఐ శ్రీనివాస్ స్థానంలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న అనురాధకు బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేకాధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్షల్లో రెవెన్యూ ఫైళ్లలో అవకతవకలు, మ్యుటేషన్ల కోసం పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకోవడం, ఆఫీసులోనే లంచం తీసుకోవడం, ట్రేడ్ లైసెన్సుల జారీలో అక్రమాలు వంటి పలు అంశాలు బయటపడ్డాయి. దీంతో డీసీ రవిబాబును రెవెన్యూ బాధ్యతల నుంచి తప్పించి, ఆయన స్థానంలో అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్‌ను నియమించారు.

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన మొదలైంది. బల్దియాలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, రెవెన్యూ సమస్యలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. దీంతో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. రెవెన్యూ విభాగం ఉన్నతాధికారి, డీసీ రవిబాబును రెవెన్యూ బాధ్యతల నుంచి తప్పించారు. అడిషనల్ కమిషనర్ రవీంద్రసాగర్‌కు ఆ బాధ్యతలను అప్పగించారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి కాకుండా ఉన్నతస్థాయి అధికారి నుంచి రెవెన్యూ ప్రక్షాళన ప్రారంభించడం కొసమెరుపు.

తరచూ వివాదాల్లో రవిబాబు

డిప్యూటీ కమిషనర్ రవిబాబు తరచూ వివాదాల్లో నానుతుంటారు. రవిబాబు గతంలోనే బల్దియాలో డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. మాజీ మేయర్ భర్తతో గొడవ పెట్టుకుని ఘర్షణ పడి వెళ్లిపోయాడు. గతంలో పని చేసిన నిర్మల్ మున్సిపాలిటీ, చింతమడక కార్పొరేషన్‌లోనూ ఇదే పరిస్థితి. దూకుడు స్వభావం, నోటి దురుసు, అందరితో తగవులు పెట్టుకుంటారనే విమర్శలున్నాయి.

తక్కువ సమయంలోనే చెడ్డపేరు..

డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ గత మార్చిలో పదవీవిరమణ పొందగానే పోస్టు ఖాళీ అయింది. ఆ తర్వాత ఏఎంసీ జయకుమార్ బాధ్యతలు నిర్వహించారు. జూన్ 24న రవిబాబు డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై కార్పొరేషన్‌లో అడుగుపెట్టాడు. రాగానే రెవెన్యూ సిబ్బందితో మాట్లాడటం, ఉద్యోగుల అటెండెన్స్ పరీక్షించడం, తన బృందాన్ని సిద్ధం చేసుకున్నారు. దీంతో కమిషనర్ దిలీప్‌కుమార్ ఈయనకు రెవెన్యూతోపాటు శానిటేషన్ బాధ్యతలను జూలై 18న అప్పగించారు. కాగా, విధుల్లో చేరిన వెంటనే పాత ఫైళ్లను బయటకు తీసి విచారణ ప్రారంభించారు. ఫైల్‌కు ఇంత అని రేటు ఫిక్స్ చేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో ఒత్తిడి పెంచారు. మ్యుటేషన్లు, ఇంటి నెంబర్లు, అసెస్‌మెంట్లు, రీఅసెస్‌మెంట్లు, పేరు మార్పులు వంటి పనులకు నేరుగా డబ్బులు తీసుకోవడం ప్రారంభించారు. డబ్బులిచ్చిన వారి పనులు వేగంగా, నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెట్టడంతో వివాదాలు పెరిగాయి. దీంతో బల్దియా మళ్లీ వార్తల్లోకి ఎక్కింది. తక్కువ సమయంలోనే డీసీ చెడ్డపేరు తెచ్చుకున్నారు. చివరికి ఆర్ఐ శ్రీనివాస్ ఏసీబీ చేతికి చిక్కేవరకు వెళ్లింది.

న్యూస్‌రీల్

విద్యార్థుల సామర్థ్యాన్ని వెలికితీయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



నిజామాబాద్ సిటీ: విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహించాలని, మెరిట్ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఈవో అశోక్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని హెచ్‌పీఎస్ పాఠశాలలో జిల్లాస్థాయి ఎఫ్ఎల్ఎం, టీఎల్ఎం మేళా శుక్రవారం నిర్వహించారు. మేళాకు అతిథులుగా హాజరైన అదనపు కలెక్టర్, డీఈవో మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఉపయోగించి విద్యార్థులలో సబ్జెక్టుకు సంబంధించిన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణ గౌడ్, సేవాలా, సాయిరెడ్డి, సందీప్, ప్రణయ్, శ్రీనివాసరావు, జె.శంకర్, సురేశ్, గంగాకిషన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగర శివారులోని ముబారక్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముబారక్‌నగర్, వీవీ నగర్, శ్రీనివాస్ నగర్, లక్ష్మీప్రియ నగర్, జనప్రియ నగర్, గ్రీన్‌పార్క్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కమ్మర్‌పల్లి: జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం ద్వారా మొదటి పీరియడ్‌లోనే హాజరు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ అధ్యాపకులను ఆదేశించారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. అడ్మిషన్ల ప్రక్రియ, తరగతి గదులను పరిశీలించి అధ్యాపకుల బోధన తీరుపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేలా అధ్యాపకులు చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని బోధనేతర సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.

'పీఎం సూర్య ఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సుభాష్‌నగర్: 'పీఎం సూర్య ఘర్' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి భారత ప్రభుత్వ లక్ష్యాన్ని 2030 వరకు చేరుకునేలా చూడాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ సూచించారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల నార్త్ బ్లాక్ సెమినార్ హాల్‌లో శుక్రవారం నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ మినిస్ట్రీ ఆఫ్ పవర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిస్కం ఇంజినీర్లకు అంతర్గత సామర్థ్యంపై, పీఎం సూర్య ఘర్ బిజిలి యోజనపై రెండ్రోజుల శిక్షణ ప్రారంభించారు. ఎస్ఈ రవీందర్ సిబ్బందికి పలు అంశాలపై సూచనలు, సలహాలు చేశారు. విశ్రాంత చీఫ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గ్రీన్ పవర్ ఎనర్జీ మన గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని తెలిపారు. ఇంజినీర్లు సోలార్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసి ఎక్కువమంది సోలార్ విద్యుత్ వాడే విధంగా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భారతి, శిక్షకులు విశ్రాంత ఎస్ఈ నరేంద్ర కుమార్, వెంకటసుబ్బయ్య, అల్జాపూర్ రమేశ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న ధరలు

- మక్క, సోయా రైతుల పాట్లు
- అమ్మకాలు మొదలయ్యే సమయంలో పడిపోయిన రేట్లు
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఎదురు చూపులు



పొలంలో కంకుల నుంచి మక్కలను వేరు చేస్తున్న హార్వెస్టర్

మోర్తాడ్(బాల్కొండ): మొక్కజొన్న, సోయా సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కోత దశకు చేరుకున్న పంటలను విక్రయించి సొమ్ము చేసుకోవాలని ఆశించిన రైతులకు నిరాశ మిగిలే పరిస్థితులే కనిపిస్తున్నాయి. పంట విక్రయించే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల కింద మక్కలకు క్వింటాలుకు రూ.2,700 ఉండగా, సోయాల ధర రూ.5,100 పలికింది. ప్రస్తుతం మక్కలకు రూ.2,200 – రూ.2,300, సోయాలకు రూ.4,700 ధర మాత్రమే లభిస్తోంది. వారం వ్యవధిలో రెండు రకాల పంటలకు క్వింటాలుకు రూ.400 వరకు ధర పడిపోవడంతో పెద్ద మొత్తంలో నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేనా?

సోయా ఎకరానికి 8 నుంచి 13 క్వింటాళ్లు, మొక్కజొన్న విడిగా సాగు చేస్తే 18 నుంచి 28 క్వింటాళ్లు, పసుపులో అంతర పంటగా సాగు చేస్తే మాత్రం 12 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో సోయాకు క్వింటాలుకు రూ.5,328, మక్కలకు రూ.2,400 మద్దతు ధర లభిస్తుంది.



కోతకు వచ్చిన సోయా

కాగా, వర్షాకాలం పంటల కొనుగోలు కోసం ఇప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో సోయా, మక్కలను వ్యాపారులకే విక్రయించాల్సి వస్తోంది. పాత పంటలకు ధరలు లభించినా, కొత్త పంటలకు ధరలు తగ్గిపోవడంతో తమకు నష్టమే అని రైతులు అంటున్నారు. కొనుగోలు కేంద్రాలు తెరుచుకుంటేనే మార్కెట్‌లో సోయా, మక్కలకు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ధరలు తగ్గితే నష్టమే..



సోయా, మక్కలకు ధర పడిపోతే రైతులకు నష్టమే. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఆరంభించాలి. అలా చేస్తేనే వ్యాపారులు ధరలు పెంచుతారు. సోయా, మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.

– ఏనుగు రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

క్విజ్‌లో పాల్గొనండి.. ప్రధానిని కలవండి

నిజామాబాద్‌నాగారం: మేరా యువ భారత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొని ప్రధానిని కలవాలని ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలి బెల్లాల్ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు అక్టోబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 10 వేల మంది యువతను ఎంపిక చేసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు అందిస్తారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ప్రభుత్వ ఖర్చులతో ఢిల్లీ తీసుకెళ్తామని, దేశాభివృద్ధికి అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీతో చర్చించే అవకాశం దక్కుతుందన్నారు. క్విజ్‌లో పాల్గొనేందుకు ఆంగ్లంతోపాటు 12 భారతీయ భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చని, సెప్టెంబర్ 1 నాటికి 15– 29 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. మై భారత్ వెబ్‌సైట్‌లో మొదట రిజిస్టర్ అయిన తర్వాత లింకు ద్వారా ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హెపటైటిస్‌తో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజశ్రీ

- డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో హెపటైటిస్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో వైరల్ హెపటైటిస్‌పై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 149 హెపటైటిస్–బి, 39 హెపటైటిస్–సి పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. ట్రాన్స్‌జెండర్లు, డ్రగ్స్ వాడేవారు, సెక్స్ వర్కర్లు, ఆరోగ్య సేవలు అందించే సిబ్బంది, టాటూ వేయించుకునేవారు, సెలూన్‌లో పనిచేసేవారు, డయాలసిస్ రోగులను హెపటైటిస్ హైరిస్క్ గ్రూపులుగా గుర్తించినట్లు తెలిపారు. బి, సి చికిత్స కేంద్రాలుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని గుర్తించినట్లు తెలిపారు. హెపటైటిస్–బి, సీ ర్యాపిడ్ టెస్టులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా పాజిటివ్ కేసుల లైన్ లిస్టును తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆఫీసర్ డాక్టర్ తుకారాం రాథోడ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి నోడల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రమోహన్, ఫార్మసీ సూపర్‌వైజర్ నారాయణ, డీపీఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తెయూలో వ్యవసాయ కళాశాల


- పీసీసీ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్
- ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా 'గురుపూజోత్సవం'



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్‌పాల్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): సమాజంలో గురువుకు ప్రత్యేక స్థానం ఉందని, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ అన్నారు. తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఆధ్వర్యంలో శుక్రవారం బర్దీపూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్ కుమార్ గౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. దేశనిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. గురుశిష్యుల అనుబంధం సక్రమంగా ఉంటే వారికి తిరుగే ఉండదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, వచ్చే మూడేళ్లలో నిజామాబాద్ జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాను చదువుకునే రోజుల్లో ప్రతిదినం అటెండర్ రెండు మోపుల కర్రలతో వచ్చేవాడని, అప్పట్లో టీచర్లతో దెబ్బలు తినడంతోనే నేడు అనేకమంది ఉన్నతస్థాయిలో ఉన్నారని చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువకుంటే ఉపాధ్యాయులు కొట్టడం కాదు కదా గట్టిగా మందలించే పరిస్థితులు లేవన్నారు. అయినా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు తమ బాధ్యతను మరువొద్దని సూచించారు.

విద్యార్థులు మంచి పౌరులుగా ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి మాట్లాడుతూ పేర్కొన్నారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వినయం, విధేయత, దేశభక్తిని నేర్పించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. అర్బన్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేయాలని, అందుకు పీసీసీ అధ్యక్షుడు బాధ్యత తీసుకోవాలని కోరారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, డీఈవో అశోక్ కుమార్, ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శేఖర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, రాష్ట్ర కోశాధికారి జయసింహాగౌడ్, జిల్లా అధ్యక్షుడు నిత్యానందం, ప్రధాన కార్యదర్శి అరుణ్, కోశాధికారి ఉప్పాల మధు, ప్రోగ్రాం కన్వీనర్ మోహన్, కో కన్వీనర్ టీఎం విక్రాంత్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు సీఎం ఆమోదం

గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో దూరదృష్టి, విజన్ లేకపోవడంతో రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో మునిగిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి నెలకు రూ.6 వేల కోట్లు వడ్డీలు చెల్లించడానికే సరిపోతుందన్నారు. అయినా ఇటీవల రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారన్నారు. తాను ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. త్వరలో తెయూలో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని, చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే నని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల జారీ విషయమై సీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. రూరల్ నియోజకవర్గంలో ట్రస్మా భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డికి మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు.

సార్లూ.. ఇదేమి పాడు బుద్ధి

- విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న కొందరు గురువులు
- జిల్లాలో ఇటీవల వెలుగులోకి పలు ఘటనలు
- పలువురిపై పోక్సో కేసులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

■ నెలక్రితం నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే టీచర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ టీచర్‌పై పోక్సో కేసు నమోదు చేసి, జైలుకు పంపారు.

■ నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నెలక్రితం ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన లెక్చరర్, విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమె కుటుంబ సభ్యులకు తెలిపింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసులో లెక్చరర్ జైలు పాలయ్యాడు.

ఖలీల్‌వాడి: విద్యార్థులకు చదువు, సంస్కారం నేర్పాల్సిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మంచీ చెడు చెప్పాల్సిన వారే సమాజంలో తలదించుకునే పనులు చేస్తున్నారు. వెకిలి చేష్టలతో కీచకులుగా మారుతున్నారు. తండ్రి లాంటి వయస్సులో ఉన్న వారు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ పవిత్రమైన వృత్తికి కళంకం తెచ్చిపెడుతున్నారు. కాగా, కొంతమంది పిల్లలు తమకు జరిగిన ఘటనలను తల్లిదండ్రులకు వివరించినా, మరికొందరు ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు చేస్తున్న ఈ చేష్టలతో మిగతా టీచర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇటీవల జిల్లాలో వరుసగా విద్యార్థినులపై గురువుల అఘాయిత్యాలు పెరగడంతో పోక్సో కేసులు నమోదవుతున్నాయి. టీచర్లు ఇలా ప్రవర్తించడంతో ఎవరిని నమ్మాల్లో.. ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి తల్లిదండ్రుల్లో నెలకొంది.

శిక్షలు పడుతున్నా..

పోక్సో కేసు నమోదైన తర్వాత పోలీసులు ఆరు నెలల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. జిల్లాలో పోక్సో కోర్టు అందుబాటులో ఉండటంతో కేసుల విచారణ త్వరగా జరిగి శిక్షలు పడుతున్నాయి. పోక్సో కేసులలో దోషులకు 20 ఏండ్ల వరకు శిక్ష ఖరారు అవుతుంది. 2022 సంవత్సరం నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 322 పోక్సో కేసులు నమోదు కావడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.



తల్లిదండ్రుల చేతుల్లో బాలికల భద్రత

- బాలికల తల్లిదండ్రులు పిల్లలపై ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచాల్సి ఉంటుంది.
- ఇంటి పరిసర ప్రాంతాలు, పాఠశాలల్లో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తున్నారా? అని అడిగి తెలుసుకోవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే చాక్లెట్లు, మిఠాయిలను సున్నితంగా తిరస్కరించేలా పిల్లలకు అవగాహన కల్పించాలి.
- ఎదుగుతున్న పిల్లలను మగవారితో సన్నిహితంగా మెలగనివ్వొద్దు. ఇంటి పక్కవారు, బంధువులతో పిల్లలను సినిమాలు, షాపింగ్, పర్యాటక ప్రాంతాలకు పంపొద్దు.

పోక్సో కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసులు
2022	80
2023	81
2024	115
2025(జనవరి నుంచి ఆగస్టు వరకు)	46

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కేసులే..

విద్యార్థినులను బ్యాడ్ టచ్ చేయొద్దు. శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తే పోక్సో కేసు నమోదు చేస్తాం. స్కూల్స్, కాలేజీల్లో షీటీమ్స్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ, ప్రైవేట్, కాలేజీల్లో కమిటీ ఏర్పాటు చేశాం. స్కూల్ యాజమాన్యం, ప్రధానోపాధ్యాయుల దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేకుంటే వారు కూడా శిక్షార్హులే.

– రాజావెంకట్‌రెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

ఖలీల్‌వాడి: జిల్లాలోని ఓపెన్ స్కూల్, ఇంటర్ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163ని అమలు చేస్తున్నట్లు సీపీ సాయిచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 28 వరకు ఓపెన్ స్కూల్, ఇంటర్ పరీక్షలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాలోని పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధిత ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. సెక్షన్ 163 ప్రకారం ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడరాదన్నారు. నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగవద్దన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు.

అలాగే జిల్లాలోని డిప్లొమా ఎలిమెంటరీ రెండో సంవత్సరం పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163ని అమలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ నెల 22 నుంచి 28 వరకు పరీక్షలు కొనసాగనున్నట్లు తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



మాక్లూర్: మండలంలోని అమ్రాద్‌తండా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్రాద్‌తండాలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే కబడ్డీ పోటీల్లో 26 టీంలు పాల్గొన్నాయి. కబడ్డీ ఆడే క్రీడాకారులకు తండాలో భోజనంతోపాటు వసతి సౌకర్యం కల్పించారు. మొదటి రోజు అమ్రాద్ ఏ టీం, బీ టీం పాల్గొన్నాయి. అనంతరం తండావాసులు గ్రామంలో నెలకొన్న కొన్ని సమస్యలను వినయ్‌రెడ్డికి విన్నవించారు. నిధులు తెప్పించి సమస్యను పరిష్కరిస్తామని, మాక్లూర్ మండలంలో ఒక మినీ స్టేడియం నిర్మాణం కోసం కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవిప్రకాష్, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, పవన్ పండిత్, వెంకటేశ్వర్‌రావు, రాజు, దయాకర్‌రావు, శ్రీహరి నాయక్, రమావత్‌నాయక్, కేతావత్‌వీర్‌సింగ్‌నాయక్, జమ్లానాయక్, జ్యోతినాయక్, పాండునాయక్, గంగారాం నాయక్ పాల్గొన్నారు.

మెడికల్ షాపులో తనిఖీలు



వర్ని: వర్ని మెడ్‌ప్లస్ మెడికల్‌లో శుక్రవారం జిల్లా డ్రగ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి, విచారణ చేపట్టారు. ఇటీవల దుకాణంలోని ఓఆర్ఎస్ ప్యాకెట్‌లో చెత్త రావడంపై వినియోగదారులు జిల్లా మెడికల్–డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దుకాణంలోని మందులు, ఇతర వస్తువులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలను సేకరించారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత వెల్లడించారు. రేపు ఫుడ్ ప్రొడక్ట్స్ విషయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మెడికల్‌లో తనిఖీలు చేసి విచారణ చేపట్టిన తర్వాత విచారణలో తేలిన అంశాలను ఒక నివేదికగా తయారుచేసి జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు. తనిఖీల్లో నిజామాబాద్ రూరల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

భారత న్యాయ విద్యకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

- అంతర్జాతీయ న్యాయవాది డాక్టర్ శ్రీనివాస రావు
- తెయూ న్యాయశాస్త్ర విభాగంలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాసరావు

తెయూ(డిచ్‌పల్లి): భారతీయ న్యాయవాదులు, న్యాయ విద్యకు ప్రపంచవ్యాప్తంగా ఎంతగానో గుర్తింపు ఉందని అంతర్జాతీయ న్యాయవాది, అమెరికాకు చెందిన డాక్టర్ కావేటి శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో న్యాయ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఆధ్వర్యంలో శుక్రవారం 'వలస చట్టాలు – వ్యక్తిగత అంతర్జాతీయ చట్టాలపై అవగాహన' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. ఇతర దేశాలకు వలసలు వెళ్లేవారు ఆయా దేశాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే వీసాలు సులభంగా పొందవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా రూల్ ఆఫ్ లా అమలు జరగడం లేదన్నారు. అంతర్జాతీయంగా భారతీయులకు న్యాయ విభాగంలో గొప్ప గుర్తింపు ఉందన్నారు. వ్యక్తుల మధ్య అంతర్జాతీయంగా వివాదాలు ఏర్పడితే ఏ ఏ న్యాయస్థానాల్లో కేసులు వేయవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించారు. కెనడా పౌరసత్వం కలిగిన బోధన్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్లోబల్ ఇఆర్‌డీ సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఉత్తం మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ప్లేస్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని, తెయూ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలతో మహోన్నతంగా ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, అధ్యాపకులు ప్రవంతి, నాగజ్యోతి, తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఉచిత సేవలు



సమాచారం..

ఖలీల్‌వాడి: పెట్రోల్ బంక్‌లో వాహనదారులకు ఉచితంగా పలు రకాలైన సేవలను నిర్వాహకులు అందించాలి.

- పెట్రోల్, డీజిల్ నాణ్యతను తెలుసుకునేందుకు అవసరమైన పరీక్షల కోసం ఫిల్టర్ పేపర్లు అందుబాటులో ఉంచాలి.
- ప్రథమ చికిత్స కిట్లు, సాధారణ మాత్రలు ఉండాలి.
- ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలి.
- మూత్రశాలలు, తాగునీరు సౌకర్యం కల్పించడంతోపాటు, వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపేందుకు యంత్రాలు ఉండాలి.
- యజమాని, సంస్థ పేరు, ఏదైనా అవసరమైతే ఎవరిని సంప్రదించాలి, వారి ఫోన్ నెంబర్లు కనిపించేలా బోర్డు ఉంచాలి.
- బంకు తెరవడం, మూసివేసే సమాచారం ప్రదర్శించాలి.
- బంకులో రోజుకు 10 వేల లీటర్ల ఇంధనం అమ్మితే, దాని ద్వారా వచ్చిన ఆదాయంలో రూ.600 సౌకర్యాల కల్పనకు కేటాయించాల్సిన నిబంధన ఉంది.
- బంకులో సౌకర్యాలు లేకపోతే సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (CPGRAMS) పోర్టల్ ఫిర్యాదు చేయవచ్చు.
- చమురు సంస్థల సేల్స్ మేనేజర్, లేదా స్థానిక తహసీల్దారుకు కూడా ఫిర్యాదు చేయొచ్చు.

క్రీడాకారులు యూనివర్సిటీకి గుర్తింపు తేవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి



పోటీల్లో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

తెయూ(డిచ్‌పల్లి): క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి తెలంగాణ యూనివర్సిటీకి గుర్తింపు తేవాలని వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి సూచించారు. తెయూ అంతర కళాశాల కబడ్డీ జట్ల (పురుషుల విభాగం) ఎంపిక పోటీలను శుక్రవారం రిజిస్ట్రార్ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు కర్ణాటక రాష్ట్రం బెలగావి రాణిచెన్నమ్మ యూనివర్సిటీలో అక్టోబర్ 4 నుంచి 7 వరకు జరగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆ పోటీల్లో చక్కని ప్రతిభ కనబర్చి విజేతగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, పీఆర్‌వో పున్నయ్య, స్పోర్ట్స్ డైరక్టర్ బాలకిషన్, పీడీలు బాలమణి, అనిల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బీఆర్ నేత, నరేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఊర్లకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

- కాలనీల్లో గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి
- సీపీ సాయిచైతన్య



సీపీ పి.సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లకు వెళ్లినట్లయితే, ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. దసరా సెలవుల నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇస్తూ ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు దసరా పండుగకు సెలవులకు ఊరికి వెళ్లే వారు నిబంధనలు పాటించాలని -ప్రజలు తమ కాలనీల్లో ఉదయం వేళ పేపర్లు, ఖాళీ సంచులు, పూల మొక్కలు, పాత ఇనుపసామాగ్రి వస్తువులను విక్రయించే వారిపై నిఘా పెట్టాలి.

- రాత్రివేళల్లో అనుమానంగా సంచరించే వారిని ప్రశ్నించాలి.
- ఇళ్లకు తాళాలు వేసి ప్రయాణాలకు వెళ్తే, ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలి.
- వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకొని ఇంటికి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- ఇంట్లో మహిళలు, వృద్ధులు ఉంటే 'అపరిచితులు' సమాచారం పేరుతో ఇంటికి వస్తే నమ్మకుండా ఉండాలి.
- విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి, నమ్మి వెళ్లకూడదు.
- ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులను ఇంటిలో ఉంచకపోవడమే మంచిది. వాటిని బ్యాంక్ లాకర్లో పెట్టుకోవడం ఉత్తమం
- కాలనీల వారిగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలి.
- పోలీస్ శాఖ వారికి అనుమానితుల సమాచారం అందించి దొంగతనాల నివారణకు సహకరించాలి.
- చుట్టుపక్కల వారి ఫోన్ నంబర్లను తెలుసుకొని, ఉంచుకోవాలి.
- బయటకు వెళ్తున్న సంగతి వెంటనే సోషల్ మీడియాలో పోస్ట్ చేయవద్దు. ప్రయాణం పూర్తయ్యాక, ఇంటికి వచ్చిన తర్వాత మాత్రమే ఫోటోలు, సమాచారం షేర్ చేసుకోవాలి.
- విద్యుత్, గ్యాస్ లైన్, ఫ్రిజ్ మొదలగు వాటిని సరిగ్గా ఆఫ్ చేయాలి.
- ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునే వారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించండి. లేదా డయల్ 100 ను సద్వినియోగం చేసుకోవాలి.

ఎస్సారెస్పీలోకి 500 టీఎంసీల వరద



ఎస్సారెస్పీ ప్రస్తుత నీటి మట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 500 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద గురువారం రాత్రికి తగ్గి, శుక్రవారం ఉదయం నుంచి పెరిగింది. గరిష్ఠంగా 3లక్షల 68 వేల క్యూసెక్కులకు పెరుగగా, సాయంత్రానికి 2లక్షల 16వేల క్యూసెక్కులకు తగ్గి, కొనసాగుతుంది.

ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ కోసం గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు తగ్గించారు. ప్రాజెక్ట్ 12 వరద గేట్ల ద్వారా 35 వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి పోతుంది. వరద కాలువ ద్వారా 6500 క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 400 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 701 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లోకి 1090.60(79.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దయాకర్ గౌడ్



దయాకర్ గౌడ్

నిజామాబాద్ లీగల్: నిజామాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా దయాకర్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. గతంలో జర్నలిస్టుగా ప్రస్థానం ప్రారంభించిన దయాకర్ గౌడ్, న్యాయవాదిగా పని చేస్తునే కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ పీఏగా, కాంగ్రెస్ పార్టీ న్యాయవిభాగం లీగల్ సెల్ రాష్ట్ర కో–కన్వీనర్‌గా సైతం విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- డీఎంహెచ్‌వో రాజశ్రీ
- నందిపేట్ పీహెచ్‌సీ తనిఖీ



నందిపేట్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నందిపేట్(ఆర్మూర్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజశ్రీ హెచ్చరించారు. నందిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుతోపాటు ఓపీ రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారి ప్రవీణ్‌ను అడిగి తెలుసుకున్నారు. 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్'లో భాగంగా మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో 113 మంది మహిళలు పలు పరీక్షలు జరిపినట్లు వైద్యాధికారి వివరించారు. వైద్య సిబ్బంది శ్రీకాంత్, గురురాజ్, స్వాతి, పీహెచ్ఎన్ పద్మావతి, భాస్కర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మాలపల్లి వైద్య శిబిరం పరిశీలన

నిజామాబాద్ నాగారం: నగరంలోని మాలపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ శుక్రవారం పరిశీలించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, శ్యామల, షాదుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు



వేల్పూర్ జెడ్పీహెచ్ఎస్ 1995-96 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో 1995–96లో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ముప్పై ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. గ్రామంలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, ఆనాటి గురువులను ఆహ్వానించారు. ఏళ్ల తర్వాత మిత్రులంతా మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

మాల్తుమ్మెద విత్తన క్షేత్రంలో ధాన్యం వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మాల్తుమ్మెద విత్తనోత్పత్తి క్షేత్రంలో విత్తన తయారీకి ఉపయోగపడని 429 క్వింటాళ్ల ధాన్యానికి శుక్రవారం సంబంధిత అధికారులు వేలం పాట నిర్వహించారు. విత్తన క్షేత్రంలో నిర్వహించిన వేలం పాటలో ఏడుగురు పాల్గొనగా వారిలో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సైకిలాబ్ గౌడ్ అనే వ్యక్తి క్వింటాల్‌కు రూ.1,590 చొప్పున పాడి ధాన్యాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి, తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ఆర్ఎం రఘు, విత్తనక్షేత్ర ఏడీఏ ఇంద్రసేన్, ఏవో అచరిత, ఎల్లారెడ్డి ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఈవో శ్యాంసుందర్ రెడ్డి, విత్తనోత్పత్తి క్షేత్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ శిక్షణా శిబిరం



కబడ్డీ శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: ముప్కాల్ మండల కేంద్రంలో జిల్లా కబడ్డీ జట్టు సభ్యులకు నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణా శిబిరం కొనసాగుతోంది. అండర్–16 బాలబాలికలకు ఈ నెల 18 నుంచి 24 వరకు శిబిరం నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు అంధ్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి గంగాధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇట్టి శిక్షణలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 28 వరకు జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కొమ్ముల నర్సయ్య, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ నునుగొండ అంజయ్య, పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



నల్లబెల్లం, పటికను పట్టుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

ఖలీల్‌వాడి: గుడుంబా తయారీకి ఉపయోగించే నిషేధిత నల్లబెల్లం, పటికను పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. ఆపరేషన్ సత్కార్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి నాందేడ్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలులో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో 2వేల కిలోల నల్లబెల్లం, 200 కిలోల పటికను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నల్ల బెల్లం విలువ రూ. 8లక్షలు, 200కిలోల పట్టిక రూ. 40 వేలు ఉంటుందన్నారు. పట్టుకున్న నల్ల బెల్లం, పటికను నిజామాబాద్ ఎక్సైజ్ అధికారులకు అప్పగించామన్నారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు ఉన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని గంజ్ మార్కెట్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈనెల 16న నగరంలోని గంజ్ మార్కెట్‌లోని కూరగాయల షాపు వద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అతడు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 55–60ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఒంటిపై బూడిద రంగు బనియన్, క్రీమ్ కలర్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712659714ను సంప్రదించాలన్నారు.

నగరంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గుర్తుపట్టలేని స్థితిలో వ్యక్తి మృతదేహం లభించిందని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఈ వయస్సు ఉన్న వారు ఎవరైనా తప్పిపోయినచో ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712659837, 8712659714కు సమాచారం అందించాలన్నారు.

నవీపేట్ మండలంలో..

నవీపేట: మండలంలోని నాగేపూర్ శివారులో శుక్రవారం ఉదయం ప్లాస్టిక్ సంచిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవన్నారు. మృతుడి వయస్సు సుమారు 30–40 ఏళ్లలోపు ఉంటుందన్నారు. దుండగులు హత్య చేసి ప్లాస్టిక్ సంచిలో మూట కట్టినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం పూర్తిగా కూలిపోయి ఉందని, మృతదేహంపై నలుపు రంగు ప్యాంటు, ఎరుపు రంగు టీషర్టు ఉందన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కూల్‌తండాలో గంజాయి మొక్కలు సీజ్



రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని స్కూల్‌తండాలో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై లావణ్య సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. తండాకు చెందిన గంగావత్ రాజేందర్ తన ఇంటి పెరట్లో అక్రమంగా 25 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం గంజాయి మొక్కలను తొలగించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను సైతం సీజ్ చేశామన్నారు. నిందితుడు విచారణలో తాను వ్యక్తిగత వినియోగం, అమ్మకాల కోసం గంజాయి సాగు చేస్తున్నట్లు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

న్యాయం చేయాలంటూ పురుగుల మందు డబ్బాతో ఆందోళన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ మాజీ కౌన్సిలర్ ఇంటి ముందు శుక్రవారం బాధితుడు మహదేవ్ న్యాయం చేయాలంటూ పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేశారు. బాధితుడు మాట్లాడుతూ.. పాల్వంచ మండలం భవానిపేట గ్రామంలోని సర్వేనెంబర్ 769/186లో ఐదు ఎకరాల 10 గుంటల భూమిని మాజీ కౌన్సిలర్ భర్త వద్ద రూ. 70లక్షలకు కొనుగోలు చేయగా, సేల్ డీడీ చేసి ఇచ్చారన్నారు. కానీ తన పేరుపైన పాస్ పుస్తకం చేసి ఇస్తానని చెప్పి రెండు సంవత్సరాలు అవుతుందని, అడిగితే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

పెన్షన్ డబ్బు చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- రూ.8 లక్షలు రికవరీ
- నిందితుల్లో ఒకరు తపాలాశాఖ ఉద్యోగి

ఖలీల్‌వాడి: మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఇటీవల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ నరేందర్ వద్ద నుంచి పెన్షన్ డబ్బులు ఎత్తుకెళ్లిన ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 30న పోస్ట్ మాస్టర్ నరేందర్ పెన్షన్ పంపిణీ కోసం రూ. 8లక్షలు ఇంటికి తీసుకురాగా, గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్ సాక్ష్యాలు ఆధారంగా నిందితులను గుర్తించి, విశ్వసనీయ సమాచారం మేరకు నవీపేట్ మండలంలోని నాగేపూర్‌కు చెందిన కొండమొల్ల రాకేష్(19), అదే గ్రామానికి చెందిన అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ పత్తి సాయికుమార్(23)ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చామన్నారు. రూ.7.68లక్షలను పత్తి సాయికుమార్ ఇంటి నుంచి, రూ.32 వేలు కొండమొల్ల రాకేష్ ఇంటి నుంచి రికవరీ చేశామన్నారు. అలాగే వారి మోటార్ సైకిల్, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

సాయికుమార్ మూడు సంవత్సరాలుగా ముబారక్ నగర్ బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. తన ఉద్యోగ రీత్యా ప్రతి పోస్ట్ ఆఫీస్‌కి సంబంధించిన పెన్షన్ డబ్బులు ఎప్పుడు తీసుకొనివస్తారు, వాటిని ఎక్కడ ఉంచుతారనే సమాచారం తెలుస్తుంది. ఈక్రమంలో సాయికుమార్‌కు పెన్షన్ డబ్బులు కాజేయాలనే ఆలోచన కలిగింది. తన దగ్గరి స్నేహితుడు, అదే గ్రామానికి చెందిన రాకేష్‌కు ఈ పథకం వివరించి, గత నెల 29న మామిడిపల్లి గ్రామానికి వెళ్లారు. పథకం ప్రకారం రాకేష్‌ను గుర్తు తెలియని వ్యక్తిగా నరేంద్ర ఇంట్లో ఆశ్రయం పొందేలా చేశాడు. రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత, రాకేష్ అక్కడి నుంచి పెన్షన్ డబ్బుల బ్యాగ్‌ను దొంగిలించి, సాయికుమార్ వద్దకు తీసుకెళ్లాడు. మాక్లూర్ పోలీసులు సమయోచితంగా చర్యలు తీసుకోవడంతో మొత్తం నగదు తిరిగి రికవరీ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది రాజేశ్వర్, రాజారెడ్డి, రాకేష్, దత్తద్రి గౌడ్, రాజు, చరణ్, ఐటీ కోర్ సిబ్బంది సాగర్, సందీప్‌ను అభినందించారు.

ఇసుక ట్రాలీ ఆటోల పట్టివేత

బోధన్: సాలూర మండలంలోని మందర్నా, హున్సా, ఖాజాపూర్ గ్రామాల నుంచి బోధన్ వైపు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు ట్రాలీ ఆటోలను రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాలీ ఆటోలను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణాకు పాల్పడితే చట్టబద్ధ చర్యలుంటాయని తహసీల్దార్ శశిభూషణ్ తెలిపారు.